క్లుప్తంగా...

ఆర్థిక సాయం



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

కాప్రా: కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి సోమవారం కాప్రా సర్కిల్‌లో పర్యటించారు. కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భర్తల యాదమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన తీవ్ర దుఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీనగర్ కాలనీలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన పుష్ప అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న రాగిడి లక్ష్మారెడ్డి ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. తనవంతు సాయంగా ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు పత్తి కుమార్, సందీప్‌గౌడ్, సంతోష్, రామలింగం, కిరణ్, సాయి, నవీన్ యాదవ్, సంజీవ నాయుడు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: శ్రావణ మాసం చివరి సోమవారం మల్కాజిగిరి మారుతీనగర్‌లోని శివాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడు శివాంక్‌తో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వెంకన్న, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు జగదీష్‌గౌడ్, జీఎన్వీ సతీష్‌కుమార్, గుండా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌గౌడ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత జి.డి.శ్రీనివాస్‌గౌడ్ దశదిన కర్మ సోమవారం మల్కాజిగిరి సరిగొండ నర్సింహారెడ్డి నగర్ గార్డెన్స్‌లో జరిగింది. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తదితరులు నివాళులు అర్పించారు.

డ్రైనేజీ పనులను ప్రారంభించాలని వినతి

మౌలాలి: మౌలాలి డివిజన్ పీబీ సూర్యానగర్, సుభాష్‌నగర్, ఆండాళ్‌నగర్, విఘ్నేశ్వరి కాలనీ, సంతోషిమానగర్, న్యూమారుతీనగర్, గోకుల్‌నగర్‌లలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరుతూ జలమండలి జీఎం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వెంకటేశ్వరనగర్ కాలనీలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో పనులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన జరిగేలా చూడాలని అధికారులకు సూచించామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, సత్యమూర్తి, బాబు, సంపత్‌రావు, కిషోర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా

ఉప్పల్: బీజేపీ ఉప్పల్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ పదవికి చంద్రమౌళి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల క్రితం తనకు పదవి ఇచ్చిన నేతలు ఇప్పటి వరకు తనకు ఎలాంటి కార్యక్రమాలకు పిలవలేదని ఎలాంటి బాధ్యతలు కూడా అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిలేని పదవి ఎందుకని రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీ నామా పత్రాన్ని పార్టీ పెద్దలకు అందించానన్నారు.

ఉప్పల్‌లో కల్తీ లొల్లి!

కల్తీ ఆహార పదార్థాల తయారీకి ఉప్పల్ అడ్డాగా మారింది. ఆహార పదార్థాలు, చిరుతిండ్లే లక్ష్యంగా ఉప్పల్‌లోని పలు ప్రాంతాల్లో కల్తీగాళ్లు పెట్రేగి పోతున్నారు. ఎక్కడ చూసినా కల్తీ కేటుగాళ్లు యథేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- రోగాలబారిన ప్రజలు
- పత్తాలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



చిలుకానగర్‌లో గడువు తీరిన ఆహార పదార్థాలు, కెమికల్స్‌తో కుల్ఫీలు తయారు చేస్తున్న వ్యక్తి (ఫైల్)



రామంతాపూర్ కేసీఆర్‌నగర్‌లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీదారుడు (ఫైల్)

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో పెరిగిపోతున్న కల్తీ ఆహార పదార్థాల నియంత్రణ విషయంలో నిఘా లేకపోవడం... తనిఖీ చేసే అధికారులు అందుబాటులో లేకపోవడంతో అక్రమార్కులకు బాగా కలిసిసొచ్చింది. ఏకంగా కెమికల్స్‌తో నకిలీ పదార్థాలు తయారు చేసి మార్కెట్లో దర్జాగా విక్రయిస్తున్నారు.

- ఉప్పల్‌కు చుట్టూ పారిశ్రామిక వాడలు అధికంగా ఉన్నాయి. ఇదే అక్రమార్కులకు ఊతమిస్తోంది.
- తాము ఏమి చేసినా చెల్లు బాటవుతుంది అనే ధీమా రోజురోజుకూ నకిలీ తయారీ సంస్థలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడరు. దీంతో అక్రమార్కులు డబ్బు సంపాదనే ధ్యేయంగా వారి వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. దీంతో అమాయక జనం కల్తీ పదార్థాలు తిని జబ్బుల బారిన పడుతున్నారు.
- 15 రోజుల వ్యవధిలోనే రెండు ప్రాంతాల్లో ఎస్‌వోటీ పోలీసులు వేర్వేరు చోట్ల దాడి చేసి కల్తీ పదార్థాలను భారీగా స్వాధీనం చేసుకున్నారు.
- చిలుకానగర్ జులై 31న గడువు ముగిసిన పదార్థాలతో ఐస్ క్రీములు, కుల్ఫీలు, ఫలూదా తయారు చేస్తున్న స్థావరంపై దాడి చేసిన ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. నిందితుడి నుంచి భారీగా నిలువ ఉన్న కుళ్లిపోయిన ఆహార పదార్థాలను... గడువు ముగిసిన పదార్థాలు, పలు రకాల కెమికల్స్‌ను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. తయారు చేసిన కుల్ఫీలను పాఠశాలల వద్ద జన సమూహం బాగా ఉన్న చోట తోపుడు బండ్ల ద్వారా విక్రయిస్తుంటారు. ఈ ముఠాలో ఓ వ్యక్తిని ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు.
- ఈ సంఘటన జరిగి పక్షం రోజులు గడవక ముందే మరో సంఘటన రామంతాపూర్ కేసీఆర్‌నగర్‌లో చోటు చేసుకుంది. మరో నకిలీ ముఠా భాగోతం బట్టబయలు అయ్యింది. ప్రాణాంతక మోనోహైడ్రేట్, గమ్, సిట్రిక్ యాసిడ్ లాంటి ప్రాణాంతకమైన కెమికల్స్‌ను వాడుతూ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈ ముఠా గుట్టును కూడా మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేసి వారి ఆట కట్టించారు. ఈ ముఠాలో ముగ్గురు ఉండగా కేవలం ఒకరినే పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. ఇలా ఏదో ఒక ప్రాంతంలో నకిలీ ఆహార పదార్థాల గుట్టు బయట పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- కేవలం డబ్బే ప్రధానంగా సాగుతున్న ఈ అక్రమ దందాను అరికట్టే వారు లేక పోవడంతోనే ఇలా పెట్రేగి పోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు తథ్యం

ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. రొటీన్‌గా అక్కడక్కడ చెక్ చేస్తుంటాం. ఎలాంటి కల్తీలు వెలుగులోకి రాలేదు. ఫిర్యాదులు ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. కల్తీ అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- మేఘం, ఉప్పల్ ఫుడ్ సేఫ్టీ అధికారి

హిందూ ధర్మం జోలికొస్తే సహించం

- మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్
- ఉదయనిధి స్టాలిన్ దిష్టి బొమ్మ దహనం



చిలుకానగర్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

ఉప్పల్: సనాతన ధర్మంపై దాడి చేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ నాయకులు హెచ్చరించారు. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ సనాతన హిందూ ధర్మంపై అనుచిత వ్యాఖలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఉప్పల్ నియోజకవర్గ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో ఉదయనిధి స్టాలిన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి వినతి ప్రతాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ... సనాతన ధర్మం, హిందూ సంస్కృతిపై నాడు అక్బర్ నుంచి ఔరంగజేబు, ఆంగ్లేయులు సహా నేడు కుహనా లౌకిక వాదులు దాడి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. కరుణానిధి సైతం రాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని నేడు అతని మనుమడు ఉదనిధి స్టాలిన్ సైతం సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హిందూ సంస్కృతిని దెబ్బ తీస్తున్న డీఎంకే పార్టీపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారి శ్రీవాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మారెడ్డి, సతీష్, డాక్టర్ శిల్పారెడ్డి, దేవిరెడ్డి, అంబటి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో అధికారుల పర్యటన



భరత్‌నగర్‌లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

రామంతాపూర్: భరత్‌నగర్ కాలనీలో సోమవారం జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేందర్, డీఈ నాగమణి, ఏఈ శ్వేతాశ్రీ పర్యటించిచారు. పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో తాము చాలా సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలైనా ఓపెన్ డ్రైన్, సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ప్రజా సంకల్పం సంస్థ ఫౌండర్ బాపట్ల కృష్ణమోహన్‌తో పాటు కాలనీవాసులు అధికారులను కోరారు. ఆయా సమస్యలన్నింటినీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సీసీ రోడ్డు , డ్రైన్ పనులను అతి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

ధరల పెరుగుదలకు నిరసనగా సీపీఎం ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

రామంతాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నిత్యావసర ధరలను పోటీపడి పెంచుతున్నాయంటూ ఆరోపిస్తూ రామంతాపూర్ రాజేంద్రనగర్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ... నిత్యావసర వస్తువులు, కూరగాయాలు ధరలు విపరీతంగా పెరిగిపోయి ఆకాశాన్ని అంటుతున్నాయని, ఏం కొనాలో ఏం తినాలో తెలియక పస్తున ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ చట్టం తెచ్చి పెరుగుతున్న ధరలను తగ్గించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. సీపీఎం ఉప్పల్ కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎం.డి.గౌస్, శ్రీనివాస్, బాలయ్య, చలపతి, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా శైలేష్‌రెడ్డి



శైలేష్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా మల్లాపూర్‌కు చెందిన గూడురు శైలేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు హబ్సిగూడలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా శైలేష్‌రెడ్డికి నియామక పత్రం అందచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, అరటికాయల భాస్కర్ ముదిరాజ్, రఘుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడిగా బాలరాజు



ఉప్పల్: కాంగ్రెస్ పార్టీ చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడిగా కొంపల్లి బాలరాజును నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ బి.మహేష్‌గౌడ్ అందజేశారు. తనకు రెండవ సారి డివిజన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు బాలరాజు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఉప్పల్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తాం



మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్ వద్ద సకాలంలో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తామని మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు అన్నారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు శ్రవణ్, సునీతా యాదవ్, మేకల సునీతాయాదవ్, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... పండగ ప్రారంభం కన్నా ముందే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. నిమజ్జనం రోజున భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, నాగరాజు పోలీస్ విభాగం వారికి సహకరించి నిమజ్జనం సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ... నిమజ్జనం రోజుల్లో ట్రాఫిక్ మళ్లింపుతో పాటు, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయిస్తామన్నారు. డీసీ రాజు మాట్లాడుతూ... గత ఏడాది నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించానని, అప్పుడు వచ్చిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సకాలంలోనే ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. గణేష్ ఉత్సవ సమితి నాయకులు పలు సూచనలు చేస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, జీఎం సునీల్‌కుమార్, జీహెచ్ఎంసీ ఏసీపీ శ్రీనివాస్‌యాదవ్, ఏడీఈ యాదగిరి పలువురుపాల్గొన్నారు.

ఆరోగ్య బీమా పేదలకు వరం



చిలుకానగర్‌లో ఇన్సూరెన్స్ నమోదులో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం చిలుకానగర్‌లో పేద ప్రజలకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని అందించే కార్యక్రమాన్ని మాసశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ప్రక్రియలో పేర్లను నమోదు చేసుకున్న వారికి దాదాపుగా రూ. 5 లక్షల ఆరోగ్య బీమాను అందించనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ... ఇన్సూరెన్స్ పేద ప్రజలకు వరం లాంటిదని... దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు బన్నాల ప్రవీణ్, వీరారెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కుషాయిగూడ: నూతనంగా ఏర్పడ్డ డెక్కన్‌కాలనీ, వీఆర్‌కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం కాలనీల్లో పర్యటించిన ఆమె స్థానిక సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలించిన ఆమె పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, నర్సింహ్మ వంశరాజ్, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అభినందన...

నూతనంగా ఎన్నికైనా చర్లపల్లి డివిజన్, ఇందిరనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అభినందించారు. సోమవారం నూతన కార్యవర్గం కార్పొరేటర్‌ను కలిశారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

లోటస్ ల్యాప్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్‌లోని లోటస్ ల్యాప్ స్కూల్‌కు గ్లోబల్ బెర్డ్స్ సంస్థ కె 12 డబ్ల్యూడబ్ల్యూ అవార్డు అందజేసింది. నగరంలో జరిగిన కె 12 గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి శిక్షకుడిగా వెళ్లారు. ఇక్కడ విద్యావ్యవస్థపై మార్పు తీసుకురావడానికి వివిధ శిక్షార్థ చర్చలు జరిగాయి. విద్యాపరమైన ప్రదేశాల్లో సాంకేతికత యొక్క అనువర్తమాన్ని పునఃపరిశీలించడం, భవిష్యత్ అభ్యాస నమూనాలు, విద్యార్థుల అభ్యసన అభిరుచులకు అనుగుణంగా బోధన జరగాలని తదితర అంశాలపై గోపాల్‌రెడ్డి వివరించారు. దీనిపై స్పందించిన గ్లోబల్ బెర్డ్స్ సంస్థ ప్రతినిధులు లోటస్ ల్యాప్ స్కూల్‌కు అవార్డు ప్రకటించి అందజేసినట్లు వెల్లడించారు. తమ స్కూల్‌కు ఈ అవార్డు రావడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు.

విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి



ఉప్పల్: విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు అశ్విని కుమార్ శర్మ ప్రధాని నరేంద్రమోదీని కోరారు. సెప్టెంబర్ 17వ తేదీని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంఘాలు విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తాయని గుర్తు చేశారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అఖిల భారత విశ్వకర్మ మహాసభ ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 17న విశ్వకర్మ కౌశల్ యోజన పథకాన్ని ప్రారంభిస్తున్న కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుభాష్ చంద్రబోస్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజమౌళిచారి, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌శర్మ, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు కిట్స్ అందజేత

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో బూత్‌లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ)లుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎన్నికల సంఘం పంపించిన బీఎల్‌ఓ కిట్స్‌ను సోమవారం కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా విధులను నిర్వహించాలని సూచించారు. సూపర్ వైజర్లు సంగీత, కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతిరెడ్డి

అల్వాల్: రహదారులపై నెలకొంటున్న మురుగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతిరెడ్డి అధికారులను సూచించారు. సోమవారం ఆదర్శనగర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు మీద మురుగునీరు నిల్వ ఉంటున్నదని, వర్షం పడినప్పుడు నీరు నిలవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్య చాలా రోజులుగా ఉందని, శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూడాలని ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ చిన్నారెడ్డి, ఏఈ లక్ష్మికి కార్పొరేటర్ సూచించారు. స్థానిక నేతలు రామారావు, జార్జ్, సర్వేశ్వరరావు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై నిరవధిక సమ్మె: సీఐటీయూ



ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయు నేతలు



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఉప్పల్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న, జిల్లా ఐద్వా నాయకురాలు ఎం.వినోద తెలిపారు. ఇందులో భాగంగా ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమ్మెకు అంగన్‌వాడీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యలను పరిష్కరించే మార్గాన్ని చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, యూనియన్ నాయకులు, ప్రేమలత, హరిప్రియ, సంతోష్ వాణి, నాగరాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు అప్రజాస్వామికం: సీపీఐ

మేడిపల్లి: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని సీపీఐ మేడిపల్లి మండల ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిపల్లి మండల అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ చేస్తున్న నిరవధిక సమ్మెను విఫలం చేసేందుకు ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ప్రధాన కార్యదర్శి నండూరి కరుణకుమారి జాయింట్ యాక్షన్ కమిటీ, మేడిపల్లి మండల ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్లు సులోచన, ధనలక్ష్మి, మేరి, కృష్ణకుమారి, మణెమ్మ, కల్పన, సంతోష్, సుకన్య, జయమ్మ, వీరికి సంఘీభావన తెలిసిన నాయకులు ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బీకేఎంయూ మండల అధ్యక్షులు భూతం ఐలయ్య, మాచర్ల కనకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ఆందోళన

అల్వాల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని అల్వాల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సునీత, జయలక్ష్మి మాట్లాడుతూ... ప్రభుత్వ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో విఫలం అయ్యిందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మంగ, సాయి ఈశ్వరి, కరుణకుమారి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.